సాక్షి కామారెడ్డి

గురువారం : 25 : జనవరి : 2024



రైల్వే గేటు మూసివేత

ఆర్వోబీ పనుల వల్ల నిజామాబాద్ నగరంలోని మాధవ నగర్ రైల్వే గేటును నెల రోజులపాటు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో ▸



సైనికుల్లా పనిచేయాలి

పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ కోరారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
29.3 /16.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆ టీచర్లు వెనక్కి!

- డిప్యుటేషన్లు, ఓడీలు రద్దు చేసిన ప్రభుత్వం
- జాబితాలో జిల్లాకు చెందిన 13 మంది

సాక్షి, కామారెడ్డి: గత ప్రభుత్వ హయాంలో పలుకుబడిని ఉపయోగించుకుని డిప్యుటేషన్లు, ఆన్‌డ్యూటీల పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి తమ స్థానాలలో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా ఎస్‌సీఈఆర్‌టీ, ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ తదితర విభాగాల్లో జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌తోపాటో ఓడీపై పనిచేస్తున్నారు. రెండేళ్లకుపైగా డిప్యుటేషన్లు, ఆన్‌డ్యూటీల పేరుతో ఉన్న వారందరూ రిలీవ్ అయి సొంత స్కూళ్లకు వెళ్లాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దీంతో వారంతా సొంత జిల్లాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. జిల్లాకు చెందిన 13 మంది టీచర్లకు సంబంధించి ఆదేశాలు వచ్చినట్లు డీఈవో రాజు తెలిపారు.

'మార్కెట్ రేటుకు కొంటాం'



కామారెడ్డి క్రైం: బహిరంగ మార్కెట్‌లో రోజువారీగా పలికే అధిక ధర వద్ద రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. కందుల కొనుగోలుపై బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 21 వేల హెక్టార్లలో కంది సాగయ్యిందని, 10 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పంట సేకరణ కోసం మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, గాంధారి మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకన్నా మార్కెట్‌లో తక్కువ ధర ఉంటే కనీస మద్దతు ధర చెల్లిస్తామన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్ కుమార్, డీఏవో భాగ్యలక్ష్మి, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంను సన్మానించిన షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కామారెడ్డి, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావు, మానాల మోహన్‌రెడ్డి ఉన్నారు.

మెలకువలు పాటించాలి

రాజంపేట: రైతులు పంట సాగులో మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. బుధవారం తలమడ్లలో వ్యవసాయ పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా యాసంగి పంటలు, ప్రస్తుత వ్యవసాయ వాతావరణ పరిస్థితులు. అలాగే సాగులో చేపట్టాల్సిన మెలకువల గురించి రైతులకు వివరించారు. పంటలో పాటించాల్సిన పలు జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.



జహీరాబాద్‌పై గురి!

- ఎంపీ టికెట్టు కోసం బీజేపీలో పోటాపోటీ
- రోజురోజుకు పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- తాజాగా తెరపైకి ఎంవీఐ ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసిన చక్రవర్తి గౌడ్

అసెంబ్లీ ఎన్నికలలో గణనీయ స్థాయిలో ఓట్లు పొందిన బీజేపీలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిత్వం విషయంలో తీవ్ర పోటీ నెలకొంది. ఎంపీ సీటు పరిధిలో కామారెడ్డిలో గెలుపొందడం, ఇతర నియోజకవర్గాలలోనూ భారీగానే ఓట్లు పోలైన నేపథ్యంలో పార్టీ టికెట్టు ఆశించేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. తాజాగా ఎంవీఐ ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసిన చక్రవర్తిగౌడ్ పేరు తెరపైకి వచ్చింది. ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు.

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి పలువురు నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మోదీ చరిష్మాతో పాటు అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగిన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలలో సులువుగా గెలువొచ్చన్న భావనతో ఉన్న వారు బీజేపీ టికెట్టు కోసం పోటీపడుతున్నారు. ప్రముఖ సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి పార్టీ టికెట్టుకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన పార్లమెంటు నియోజకవర్గం అంతటా కలియతిరుగుతున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలను కలిసి మద్దతు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో బీజేపీలో చేరి ఆ పార్టీ ఎల్లారెడ్డి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి సైతం తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బిచ్కుందలోని బండాయప్ప మఠాధిపతి సోమాయప్ప స్వామీజీ కూడా టికెట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. స్వామీజీలు, బీజేపీ జాతీయ నేతలతో ఉన్న పరిచయాలతో ఆయన టికెట్టుకోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాంసింగ్ కూడా అభ్యర్థిత్వం రేసులో ఉన్నారు. మొదటి నుంచి ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటున్న ఆయనకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో పరిచయాలు ఉన్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ బాగారెడ్డి తనయుడు ఎం.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆలె నరేంద్ర తనయుడు ఆలె భాస్కర్ తదితరులు కూడా కాషాయ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్టు కోసం బీజేపీలో 30 మంది పోటీపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎంత ఖర్చుకైనా రెడీ..

జహీరాబాద్ నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న వారిలో చాలా మంది ఎంత ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఒక్కో సెగ్మెంట్‌కు రూ. పది కోట్లు కూడా ఖర్చు చేస్తామని పలువురు పేర్కొంటున్నట్లు తెలిసింది. మోదీ చరిష్మాతో పాటు అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగిన నేపథ్యంలో సులువుగా గెలిచే అవకాశాలు ఉంటాయన్న భావనతో ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు వెనుకాడబోమని చెబుతున్నట్లు సమాచారం.

తాజాగా మరొకరు..



జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిత్వం ఆశిస్తున్నవారిలో తాజాగా మరొకరి పేరు చేరింది. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, కామారెడ్డి పట్టణానికి చెందిన ఎంజీ చక్రవర్తిగౌడ్ సైతం బీజేపీ టికెట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన గతేడాది జూలై 31న ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేశారు. దశాబ్ద కాలానికిపైగా శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే చక్రవర్తిగౌడ్ కుటుంబం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా అండగా నిలిచి పలువురికి మంచి భవిష్యత్తును కల్పించింది. చక్రవర్తిగౌడ్ సోదరుడు ఎంజీ వేణుగోపాల్‌గౌడ్ కూడా రాజకీయాల్లో ఉన్నారు. చక్రవర్తి గౌడ్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా సంగారెడ్డి జిల్లాలో చాలా కాలం పనిచేశారు. పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో విస్తృత పరిచయాలు ఉన్నాయి. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఉద్దేశంతో కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో ఉన్న పరిచయాల ద్వారా ఆయన టికెట్టు కోసం యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సరికి ఆశావహుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు.

ఎమ్మెల్యేల ఆస్తుల చిట్టా

- 10 శాతం తగ్గిన పోచారం ఆస్తి విలువ
- మదన్‌మోహన్‌రావు ఆస్తులు రూ.72.65 కోట్లు
- వెంకటరమణారెడ్డి ఆస్తుల విలువ రూ. 49.71 కోట్లు
- లక్ష్మీకాంతారావుకు రూ.8.11 కోట్ల ఆస్తులు
- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ నివేదిక



సాక్షి, కామారెడ్డి: ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ రాష్ట్రంలోని 119 మంది ఎమ్మెల్యేల ఆస్తుల వివరాలను బుధవారం విడుదల చేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ఆధారంగా ఆస్తుల వివరాలను ప్రకటించింది. కామారెడ్డి జిల్లాకు సంబంధించి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆస్తి 2018 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం రూ. 4.94 కోట్లు కాగా.. 2023 కు వచ్చేసరికి పది శాతం తగ్గింది. తాజా ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన తన ఆస్తుల విలువను రూ. 4.40 కోట్లుగా చూపించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న నలుగురు ఎమ్మెల్యేలలో తక్కువ ఆస్తి ఉన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కావడం గమనార్హం. ఆయనపై ఒక్క కేసూ లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రకటించింది.

- జిల్లాలో అత్యధిక ఆస్తులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కే.మదన్‌మోహన్‌రావుకు ఉన్నాయి. ఎన్‌ఆర్‌ఐ అయిన మదన్‌మోహన్‌రావు ఎంఎస్ చదివి, పలు దేశాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలను స్థాపించారు. ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో తన మొత్తం ఆస్తి విలువను రూ.72.65 కోట్లుగా చూపించారు. ఆయనపై రెండు కేసులున్నాయి.
- కామారెడ్డిలో అటు కేసీఆర్‌ను, ఇటు రేవంత్‌రెడ్డిని ఓడించి వార్తల్లో వ్యక్తిగా నిలిచిన జెయింట్ కిల్లర్ కాటిపల్లి వెంకటరమణారెడ్డికి రూ.49.71 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఆయనపై పదకొండు కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. ఇంటర్ వరకు చదువుకున్నారు.
- ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన జుక్కల్‌లో విజయం సాధించిన తోట లక్ష్మీకాంతారావు ఆస్తుల విలువ రూ. 8.11 కోట్లు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆయనపై రెండు కేసులున్నాయి.

నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్‌నాగారం: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి రూ. 109.97కోట్ల ఆస్తులున్నాయి. ఆయ న బీఏ చదువును మధ్యలోనే ఆపేశారు.

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆస్తి ఐదేళ్లలో 238 శాతం పెరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో రూ. 34.76 కోట్ల ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. 2018లో రూ. 10.27 కోట్లుగా చూపించారు. బీఈ చదివారు. ఆయనపై ఒక కేసు ఉంది.
- నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి రూ. 59.94 కోట్ల ఆస్తులున్నాయి. ఎంఎస్ ఆర్థో చదివారు. ఆయనపై రెండు కేసులున్నాయి.
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి రూ. 18.5 కోట్ల ఆస్తులున్నాయి. ఏడో తరగతి చదివారు. ఆయనపై ఒక కేసు ఉంది.
- నిజామాబాద్‌అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాకు రూ. 27.25కోట్ల ఆస్తులున్నాయి. బీకాం వరకు చదివారు.

అక్బర్‌నగర్ శివారులో చిరుత సంచారం

రుద్రూర్: నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ శివారులో గల వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా చిరుత సంచరిస్తోంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం ఉదయం గ్రామశివారులో జంతువు కళేబరాన్ని గుర్తించిన పరిశోధన కేంద్రం సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి అక్కడ ఉన్న పాదాలను పరిశీలించారు. అడవి పందిపై జిట్ట పులి దాడిచేసి చంపినట్లుగా నిర్ధారించారు. ఈ ప్రాంతానికి ఒంటరిగా ఎవరు రావద్దని.. తప్పని సరిగా రావాల్సి వస్తే టపాసులు కాల్చి శబ్దం చేయాలని సూచించారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని.. పులి మళ్లీ వస్తే బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చంద్రప్రకాశ్, బాబు తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం!

- కొత్తగా చేరుతున్న వారితో తమకు నష్టమన్న భావన
- గ్రామ, పట్టణ, మండల స్థాయి నేతల్లో ఆందోళన



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పెరిగాయి. రోజూ ఏదో ఒక మండలం, పట్టణానికి చెందిన నాయకులు హస్తం గూటికి చేరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఇప్పటికే కామారెడ్డి బల్దియా పరిధిలో పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అలాగే నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లోకి వలస వస్తున్నారు. భిక్కనూరు, దోమకొండ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు షబ్బీర్‌అలీ ఇంటికి వరుస కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లుగా పార్టీలో ఉండి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేతల్లో టెన్షన్ మొదలైంది. కొత్తగా వచ్చి చేరుతున్న నేతల వల్ల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అవకాశాలకు ఎక్కడ గండి పడుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. భిక్కనూరు, రాజంపేట, దోమకొండ మండలాలకు చెందిన పలువురు మండల స్థాయి నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీ అయ్యారని, అయితే దీనిపై పార్టీలో కొనసాగుతున్న పలువురు నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. కానీ పార్టీని బలోపేతం చేసుకోవడానికి ఎవరు వచ్చినా తీసుకోవలసిందేనని కాంగ్రెస్ ముఖ్యనేతలు వారికి నచ్చజెప్పినట్లు తెలిసింది. అయితే ఇంతకాలం ఎవరితో కొట్లాడారో ఇప్పుడు వారితోనే కలిసి పనిచేసేందుకు పలువురు ఇష్టపడడం లేదు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో దిగాలని కలలుగన్న ఎంతోమంది ఇబ్బందిపడుతున్నారు. అధికారం ఎక్కడ ఉంటే ఆ పార్టీలోకి మారుతున్న నేతల విషయంలో కాంగ్రెస్ నాయకత్వం ఆలోచించాలని, పార్టీని నమ్ముకుని ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు నాయకులు కోరుతున్నారు.

'ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి'

కామారెడ్డి క్రైం: పిల్లలలో నులిపురుగులను నివారించేందుకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలలో నులి పురుగులు ఉన్నట్లయితే రక్తహీనత, ఆకలి లేమి, కడుపునొప్పిలాంటి సమస్యలతో బాధపడతారన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో పేద పిల్లలు చెప్పులు లేకుండా నడవడం కారణంగా ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 2,52,538 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వచ్చేనెల 12 న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలన్నారు. 3 నుండి 19 ఏళ్లలోపు పిల్లలకు చప్పరించే మాత్రలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధికారులు దయానంద్, షేక్ సలాం, మురళీకృష్ణ, సునీత, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రాజేశ్వర్, శ్రీనివాస్‌రావు, డాక్టర్ నరసింహం, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బాలికలను రక్షించుకుందాం



మొక్కను నాటుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: బాలికలను రక్షించుకోవాలని, వారిని చదివించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్షణ కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి వారి బంగారు భవిష్యత్తునకు పునాది బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, సీడీపీవో శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో క్రెడిట్ స్కాం

- వీసాల పేరిట రూ. 5 కోట్లు వసూలు చేసిన ఏజెంట్
- దుబాయికి వెళ్లాక కొందరికే వర్క్ వీసాలు
- బాధితులకు క్రెడిట్‌కార్డులు ఇప్పించి మరో రూ. 5 కోట్లు విత్‌డ్రా..
- డబ్బులు చెల్లించకపోవడంతో డిఫాల్ట్ అయిన బాధితులు
- ఇండియాకు పంపించేసిన వైనం
- సీపీకి బాధితుల ఫిర్యాదు

ఖలీల్‌వాడి: గల్ఫ్ ఏజెంట్లు నయా స్కాంకు తెరలేపారు. గతంలో కొందరు నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసేవారు. మరికొందరు విజిట్ వీసాపై పంపించి పనిచూపించకుండా మోసం చేసేవారు. తాజాగా కొత్తరకం మోసానికి పాల్పడుతున్నారు. వీసాలు ఇప్పించి దుబాయ్‌కు పిలిపించుకుని కొన్ని రోజుల పాటు తమ వద్ద ఉంచుకొని.. వీరి పేర్ల మీద క్రెడిట్ కార్డుల ద్వారా లోన్లు తీసుకొని వారిని తిరిగి ఇంటికి పంపించేస్తున్నారు. దుబాయ్‌కు చెందిన క్రెడిట్ కార్డుకు సంబంధించిన బ్యాంక్ సిబ్బంది ఈఎంఐలు చెల్లించాలని బెదిరింపులకు దిగడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులు మంగళవారం సీపీ కల్మేశ్వర్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టాలని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజును సీపీ ఆదేశించారు.

అసలేం జరిగిందంటే..

దుబాయ్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని ప్రతినెలా రూ. 40వేల నుంచి రూ. 50వేల వేతనంతో పాటు రూ. 50 లక్షల క్రెడిట్ కార్డు సౌకర్యం ఉంటుందని జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌కు చెందిన ఏజెంట్ పబ్బ భూమేశ్ అలియాస్ దండిగాళ్ల భూమేశ్ అలియాస్ భూమారెడ్డి సబ్ ఏజెంట్లను నమ్మబలికాడు. డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన భోజారాం మరో ఇద్దరు సబ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాలకు చెందిన 82 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ. 6లక్షల చొప్పున వీసాకు వసూలు చేశారు. వీరి నుంచి వసూలు చేసిన సుమారు రూ. 5కోట్లను పబ్బ భూమేశ్ సూచించిన వారికి చెల్లించారు. భోజారం నిజామాబాద్‌లోని శ్రీదేవి ట్రావెల్స్‌కు చెందిన బెజ్జం సుబ్బారెడ్డికి రూ. 2కోట్లను చెల్లించాడు. వెంటనే డబ్బులు చెల్లించినట్లు భోజారాం పబ్బ భూమేశ్‌కు వాట్సాప్‌లో వాయిస్ మేసేజ్ చేశారు. తర్వాత ఆర్మూర్‌కు చెందిన అరెపల్లి మోహన్, ఆరెపల్లి నరేశ్, మోచ(బాడ్సి) రాజులకు రూ. 3కోట్లు భోజారాం చెల్లించారు. అనంతరం వీరికి దుబాయ్ విజిట్ వీసాలను దశల వారీగా ఇప్పించారు. అక్కడికి వెళ్లాక పబ్బ భూమేశ్ ఏర్పాటు చేసిన రూంలో ఉంచారు. 82 మందిలో 30 మందికి మాత్రమే వర్క్ పర్మిట్ ఇప్పించి క్రెడిట్ కార్డులు ఇప్పించాడు. బాధితులు మంగళవారం సీపీని కలిసి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ విషయమై నాలుగు నెలల క్రితం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

బాధితుల క్రెడిట్ కార్డుల నుంచి..

నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన 82 మందిలో 30 మందికి వర్క్ వీసాలు రావడంతో పబ్బ భూమేశ్ అక్కడి క్రెడిట్ కార్డు బ్యాంక్ సిబ్బందితో అరబ్బీ, ఇంగ్లిష్‌లలో ఉన్న ఫారాలపై సంతకాలు చేయించాడు. తన అడ్రస్ పైనే క్రెడిట్ కార్డులు తీసుకున్నాడు. అవి రాగానే వాటి నుంచి మరో రూ. 5 కోట్లు డ్రా చేసినట్లు బాధితులు సీపీకి విన్నవించారు. క్రెడిట్ కార్డులకు సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడం వల్ల డిఫాల్ట్ కావడంతో వీసా సమస్య ఉందని, ఇండియా వెళ్లిపోకపోతే జైలుకు వెళ్తారని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బాధితులు భోజారాంనకు ఫోన్ చేసి తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో త్వరగా ఇండియాకు వెళ్తే.. ఒక్కొక్కరికి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు తిరిగి ఇచ్చేస్తానని పబ్బ భూమేశ్ బాధితులకు చెప్పి పంపించేశాడు. ఇక్కడకు వచ్చిన తర్వాత డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడు. దుబాయ్‌లోని క్రెడిట్ కార్డుకు సంబంధించిన బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

విచారణ చేపడుతున్నాం

సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు గల్ఫ్‌లో జరిగిన మోసంపై విచారణ చేపట్టాం. సబ్ ఏజెంట్ భోజారం డబ్బులు ఎవరికి ఇచ్చారనే దానిపై విచారిస్తాం. బెజ్జం సుబ్బారెడ్డి, ఆరెపల్లి మహేశ్, ఆరెపల్లి నరేశ్, మోచ(బాడ్సి) రాజులకు డబ్బులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్ని అంశాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ లేని ఏజెంట్లకు డబ్బులు చెల్లించి మోసపోవద్దు. – రాజశేఖరరాజు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ, నిజామాబాద్

'ఆటో డ్రైవర్లకు జీవనభృతి ఇవ్వాలి'

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తమకు రూ. 15 వేల జీవన భృతి ఇవ్వాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని చర్చ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా వెలమ ఫంక్షన్ హాల్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆటో యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల ఆటోలు నడవడం లేదన్నారు. మహిళలు బస్సులలోనే ప్రయాణిస్తున్నారని, దీంతో తమ ఆదాయం దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడ్డా రూ. 200 కూడా రావడం లేదన్నారు. తక్షణమే జీవనభృతి అమలు చేయాలని, ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

క్లుప్తంగా

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మాచారెడ్డి విద్యార్థిని



మాచారెడ్డి: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మాచారెడ్డి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఏనుగు అశ్విత ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వెంకటాచారి బుధవారం తెలిపారు. ఇటీవల ఆసిఫాబాద్‌లో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచిన అశ్విత ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఝార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ అశోక్, ఎస్ఎంసీ ఛైర్మన్ రాంరెడ్డి, గ్రామ పెద్దలు నారాయణ, ప్రభాకర్, సత్యనారాయణ అశ్వితను అభినందించారు.

మోదీ సర్కారుకు మద్దతుగా నిలవాలి



కామారెడ్డి టౌన్: కేంద్రంలోని మోదీ సర్కారుకు ప్రతీ ఒక్కరు మద్దతుగా నిలవాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు 7820078200 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి మోదీకి మద్దతుగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ యువ ఓటర్లకు ఇచ్చే ప్రసంగాన్ని ప్రతి ఒక్కరు వినాలని అన్నారు. అనంతరం నమో డాటా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాజేష్, వేణు, నవీన్, సాయి తదితరులున్నారు.

ఎన్ఆర్ఎస్‌సీ సందర్శన



భిక్కనూరు: హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)ను బుధవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ సందర్శించారు. ఎన్ఆర్ఎస్‌సీ ట్రెనింగ్ అండ్ అవుట్ రీచ్ ప్రోగ్రాం హెడ్ జి.శ్రీనివాస్‌రావుతో సమావేశమై సౌత్‌క్యాంపస్ జియో ఇన్ఫర్మాటిక్స్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ గురించి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, దోమకొండ గ్రామాభివృద్ధి కోసం విలేజ్ ఇన్ఫర్మేషన్ సిస్టంను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై చర్చించారు. పలు అంశాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, సహకారాన్ని అందిస్తామని శ్రీనివాస్‌రావు హామీ ఇచ్చారని సుధాకర్ గౌడ్ తెలిపారు. ఆయన వెంట సౌత్ క్యాంపస్ అధ్యాపకుడు నారాయణగుప్తా ఉన్నారు.

'ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారు'



కామారెడ్డి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన వందల మంది మేధావుల ఆలోచన విధానంతో భారత రాజ్యాంగం రూపొందినట్లు ఏపీటీఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్ అన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి ఎల్ఐసీ శాఖలో ప్లాటినం జూబ్లీ రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం సామాన్యులకు అర్థం కావడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. నేడు ప్రశ్నించే వారిని ప్రభుత్వం నిర్బంధిస్తున్నారని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్, కార్యదర్శి కాసాల అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు పాత నిబంధనే..!

- గత ప్రభుత్వం అమలు చేసిన పాలసీ ప్రకారమే తవ్వకాలు
- పర్మిట్ల జారీలో పారదర్శకంగా వ్యవహరించాలంటున్న ఉన్నతాధికారులు



సుంకెట్ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

మోర్తాడ్: ఇసుక, మొరం తవ్వకాలకు కొత్త నిబంధనలు అమలు చేస్తారని ప్రచారం జరిగినా ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో పాత నిబంధనల ప్రకారమే వర్తిస్తాయని వెల్లడైంది. ఇసుక, మొరం తవ్వకాలతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలుగకుండా ఉండేందుకు పర్మిట్లను జారీ చేయడం, అక్రమ తవ్వకాలు లేకుండా చూడాలని ఉన్నతాధికారులు మండల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పెద్దవాగు, కప్పలవాగు, ఇతర వాగులు, గోదావరి, మంజీర నదుల నుంచి ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అలాగే వరద కాలువ, ఆయా ప్రాంతాలలోని కొండల నుంచి మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇసుక తవ్వకాలకు సంబంధించి ప్రైవేటు భవనాల నిర్మాణాలకు ట్రాక్టర్ ఇసుకకు రూ.900లు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుకను తరలిస్తే రూ.650 చొప్పున ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంది. మొరం తవ్వకాలకు తక్కువ మొత్తంలోనే చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం అమలు చేసిన పాలసీనే ఈ ప్రభుత్వం కొనసాగించనుందని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక, మొరం తవ్వకాలకు అధికారులు అనుమతి ఇవ్వలేదు. పాలసీలో మార్పులు ఉంటాయనే ఉద్దేశంతో అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇసుక, మొరంలకు కొరత తీవ్రమైంది. అనేక చోట్ల నిర్మాణాలు ఆగిపోయాయి. పాలసీలో మార్పులు ఉండవని స్పష్టత రావడంతో ఇసుక తరలించడానికి అనుమతులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

పర్మిట్లు జారీ చేస్తాం..

ఇసుక తవ్వకాలకు పాత పాలసీ ప్రకారమే అనుమతులు ఇస్తాం. రెండు మూడు రోజుల్లో పర్మిట్లను జారీ చేస్తాం. నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు.

– వినోద్, ఆర్డీవో, ఆర్మూర్

సమస్యలపై ప్రభుత్వానిది నిర్లక్ష్య వైఖరి

- మాక్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రతిపక్షాలు



తడ్గూర్ హైస్కూల్‌లో నిర్వహించిన మాదిరి శాసనసభ

మద్నూర్ : మహిళల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహిస్తోందని, మహిళలపై వేధింపులు , బాల్యవివాహాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. అయితే మహిళల కోసం తమ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నా కానీ ప్రతిపక్షాలకు ఇవి కనిపించడం లేదని అధికార పార్టీ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఇవి జరిగింది మన అసెంబ్లీలో కాదు, మాదిరి అసెంబ్లీ(మాక్ అసెంబ్లీ)లో...

మద్నూర్ మండలం పెద్ద తడుగూరు హైస్కూల్లో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థులు ప్రతిపక్ష సభ్యులుగా, అధికార పార్టీ సభ్యులుగా మారి సమస్యలపై వాదోపవాదాలు నిర్వహించారు. మహిళ, రైతు సమస్యలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి వాటిపైన చర్చలు జరిగాయి. అనంతరం బహిరంగ ప్రదేశంలో పొగ తాగడం నిషేధించే బిల్లుపై చర్చ జరిపి ఆమోదించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సామల పట్టాభి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నూతిపల్లి బాలరాజ్, ఉపాధ్యాయులు గౌతమ్, రమేష్, రజిని, కాశీరాం, సంతోష్, భుజంగ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మండల నోడల్ ఆఫీసర్ మల్లేశం, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రాజేందర్ విచ్చేశారు.

అసెంబ్లీ విశేషాలు తెలిశాయి



అసెంబ్లీలో చర్చలు ఎలా సాగుతాయి.. బిల్లులు ఎలా ఆమోదం పొందుతాయి అనే అంశాలు నాకు స్పష్టంగా అర్థమయ్యాయి. స్పీకర్‌గా వ్యవహరించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

– చెన్నమ్మ, స్పీకర్, మాక్ అసెంబ్లీ

మంచి అవగాహన వచ్చింది



మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని కలిగించాం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు చక్కగా అర్థమవుతాయి. వెనుకబడిన పిల్లలకు కూడా ఎంతో ఉపయుక్తం.

– హెచ్ఎం, సామల పట్టాభి

బాలికల్లో రక్తహీనత నిర్మూలించడమే లక్ష్యం



నిజామాబాద్‌నాగారం: బాలికల్లో రక్తహీనత నిర్మూలించడమే లక్ష్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలలో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. బాలికల్లో రక్త హీనత నిర్మూలణే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థినులకు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి అరవింద్, డాక్టర్ అజమాత్, కళాశాల ప్రిన్సిపాల్ రాగలత, సిబ్బంది పాల్గొన్నారు.

26న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 26, 27వ తేదీల్లో రా ష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్న ట్లు కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్ బుధవారం తెలిపా రు. డబుల్స్ పద్ధతిన నిర్వహించే ఈ టోర్నీ లో అన్ని కేటగిరిల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 600 ఉంటుందని తమ పేర్లను 9440 295523, 99 12179291 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడా కా రులకు నగదు బహుమతి అందిస్తామన్నారు.

29న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: పీఎఫ్ చందాదారుల సమస్యలు పరిష్కరించే నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని ఈ నెలా 29న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర మోటర్స్(హైదరాబాద్‌రోడ్డు)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్‌వీ శ్రవణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పింఛన్‌దారులు తగిన ఆధారాలతో హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

మాధవనగర్ రైల్వేగేట్ మూసివేత



మాధవనగర్ రైల్వే గేట్ వద్ద రోడ్డు మూసివేస్తున్నట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, అడ్డుగా ఉంచిన బారికేడ్లు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ మాధవనగర్ రైల్వేగేట్‌ను బుధవారం రాత్రి నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో భాగంగా పట్టాలకు ఇరువైపులా 6 మీటర్ల లోతుగా పనులు చేపట్టాల్సి ఉందన్నారు. నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా నెల రోజుల(ఫిబ్రవరి 23) వరకు గేట్ మూసి ఉంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రైల్వే అధికారుల వినతి మేరకు కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఆదేశాలతో రైల్వేగేట్ వద్ద పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మూసివేస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు ద్విచక్రవాహనాల రాకపోకలు సాగించాయి. అయితే రాత్రి నుంచి పూర్తిగా గేటు మూసివేసి రోడ్డు మూసివేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి వినాయకనగర్, ఆర్యనగర్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్లే వాహనదారులు బోర్గాం(పి), మోపాల్, కంజర, ముల్లంగి(ఐ) గ్రామాల మీదుగా వెళ్లాలని, డిచ్‌పల్లి వైపు నుంచి నిజామాబాద్ వచ్చే వాహనదారులు బైపాస్ మీదుగా రాకపోకలు సాగించాలని పోలీసులు సూచించారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



అంజయ్య (ఫైల్)

నస్రుల్లాబాద్: మండలంలోని గండి ప్రాంతంలో అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లావణ్య బుధవారం తెలిపారు. మృతుడు నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం కల్లూర్ గ్రామానికి చెందిన జంగంవార్ అంజయ్య(48)గా పోలీసులు గుర్తించారు. అంజయ్య గత నెల డిసెంబర్ 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో అంజయ్య కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధ భరించలేకే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య సరిత చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మరొకరు..



మల్లేశ్ మృతదేహం

మోర్తాడ్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన మల్లేశ్(46) మో ర్తాడ్‌గుండా వెళ్తుండగా ఓ పంట పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య



ఆర్మూర్ టౌన్: మండలంలోని గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన గజిబిజికర్ శ్రీనివాస్(30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు భార్యతో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య తల్లిగారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పేకాట స్థావరం పై దాడి

బోధన్‌టౌన్: పట్టణంలోని చెక్కి చెరువు సమీపంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. పక్కా సమాచారం పేకాట స్థావరంపై దాడి చేసి 14 మందిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీఐలు అంజయ్య, అజయ్ బాబు తెలిపారు. దాడిలో వీరి నుంచి రూ. 42,290 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

దుర్కిలో..

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై లావణ్య బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురి అరెస్టు చేశామని వారి నుంచి రూ. 1210 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో సిబ్బంది సాగర్‌గౌడ్, ఖాజాపాషా, మహేశ్ ఉన్నారు.

యువకుడి అదృశ్యం



నరేందర్

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని టేక్రి యాల్ గ్రామానికి చెందిన నరేందర్ అనే యువకుడు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు బుధవారం తెలిపారు. నరేందర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 2న హైదరాబాద్ వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్ కుమార్

రాజంపేట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. అనంతరం మీ–సేవ ఆపరేటర్లకు సర్టిఫికెట్లు ఇచ్చి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లపై తగు సూచనలు ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోడానికి ఏడాదిలో నాలుగు సార్లు భారత ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం నేపథ్యంలో బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణ మహిళా సమాఖ్య సభ్యులకు, దేవునిపల్లి, లింగాపూర్ తదితర ప్రాంతాల మహిళా గ్రూపుల సభ్యులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా చోట్ల ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. టీఎంసీ అధ్యక్షురాలు సంతోషి, సభ్యులు పాల్గొన్నారు.

జాబితాలో తప్పులు లేకుండా చూడండి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని బీఎల్‌వోలకు తహసీల్దార్ రాజు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ బావయ్య, గిర్దావార్ అంజు, ఎంపీవో రాము, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



లింగాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బాన్సువాడ ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి

బాన్సువాడ రూరల్: మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని బాన్సువాడ ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇంటి బిల్లులు వెంటనే చెల్లించాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌ను నియమించి వైద్యసేవలు మెరుగు పర్చాలని ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి కోరారు. బాన్సువాడలో కోర్టు భవన సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, నర్సింగ్ కళాశాల పనులు మే చివరి కల్లా పూర్తి చేస్తామని పంచాయత్‌రాజ్ అధికారులు తెలిపారు. ఆర్టీసీ డీఎంకు బదులుగా కొన్నేళ్లుగా కిందిస్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. కోతుల బెడద నివారణకు ఈసారి హరితహారంలో అటవీ ప్రాంతానికి అనుకుని ఉన్న గ్రామాల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఉద్యాన, పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టిసారించాలని అధికారి సంతోష్ కోరారు. 38 నెలలకు సంబంధించి డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రుణాల డబ్బులు రావాల్సి ఉందని సీసీ సాయిరెడ్డి తెలిపారు. బుడిమి పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిని నియమించాలని కో–ఆప్షన్ సభ్యుడు ఖమ్రొద్దీన్ కోరారు.

3.5 కిలోల గంజాయి పట్టివేత



నందిపేటలో స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

నందిపేట్: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు జిల్లా కేంద్రంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన జిలకర ప్రసాద్, విద్యాసాగర్‌గా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, స్థానిక ఎస్సై రాహుల్ తెలిపారు.

నిందితులకు సెల్‌ఫోన్లు కూడా లేవట..!

గంజాయి పట్టివేతలో దొరికిన ఇద్దరు నిందితులు నందిపేట్ మండలంలో ఎవరికి సరఫరా చేస్తున్న విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. ఎవరికి సరఫరా చేస్తున్నట్లు నిందితులు తెలుపడం లేదని, కనీసం వారి వద్ద సెల్ ఫోన్లు కూడా లేవని పోలీసులు పేర్కొన్నారు. తాము గంజాయి సేవించే వారికి ప్రత్యక్షంగానే విక్రయిస్తామని నిందితులు వెల్లడించినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇంత పెద్దమొత్తంలో దొరికిన 3.5 కిలోల గంజాయిని నిందితులు నేరుగానే విక్రయించడం ఎలా సాధ్యమవుతుందనేది మండల ప్రజల్లో నెలకొన్న ప్రశ్న. ఈ గంజాయిని సదరు నిందితులు మండల కేంద్రానికి చెందిన పలువురు పెద్ద మనుషుల కోసమే తెచ్చినట్లు తెలుస్తోంది. కానీ గంజాయి విక్రయదారు పేర్లను పోలీసులు మాత్రం బయటకు చెప్పకపోవడం గమనార్హం.

అంజనిలో 800 గ్రాముల గంజాయి..



పెద్దకొడప్‌గల్: అక్రమంగా విక్రయిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ డి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అంజని గ్రామనికి చెందిన నర్మల హనుమాండ్లు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి అతని ఇంట్లో దాడి చేయగా 800 గ్రాముల ఎండు గంజాయి దొరికిందన్నారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడిలో ఎస్సై అభిషేక్, హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య, కానిస్టేబుళ్లు పరశురాం, నవీన్ రెడ్డి, శ్రీధర్, అనిత, ప్రేమలత పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యంతో పోలీసులు

ఎడపల్లి: మండలంలోని కర్నాపల్లిలో మినీ డీసీఎంలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై విక్రం బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకొన్ని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనాన్ని పీఎస్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్..

వేల్పూర్: మండలంలోని పడగల్ నుంచి లక్కోర వైపు బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

